క్లుప్తంగా

పార్టీ అధినేతను కలిసిన పవన్



జగనన్నను కలసిన యువ నాయకుడు పవన్

శ్రీరంగరాజపురం : మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పవన్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో కలిశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో కూటమి నేతల అవినీతి, అరాచకం, దౌర్జన్యం, దాడులు గురించి, సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీలతో ప్రజలను ఎంతగా వంచించిందో విస్తృతంగా చాటిచెప్పాలని అధినేత సూచించారని తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నిండ్ర: మండలంలోని ఎలకాటూరు దళితవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల యవజన విభాగం అధ్యక్షుడు గుణ తాత కందయ్య నాలుగురోజుల క్రితం మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి రోజా పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, సర్పంచులు చంద్రబాబు, బాబురెడ్డి, వీరయ్య, కృష్ణమూర్తి, అనిల్ కుమార్, విజేష్, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా జయంతి



వంగవీటి రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాపు నాయకులు

నగరి: మున్సిపల్ పరిధిలోని కాపు సంఘాల నాయకులు వంగవీటి రంగా 78వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు ఎంపీ బాబు ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం వద్ద వంగవీటి రంగా చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. పలువురు కాపుసంఘ నాయకులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



బట్టికండ్రిగ వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు, రోడ్డుపై విద్యార్థులు

వడమాలపేట (విజయపురం): తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వడమాలపేట మండలం బట్టికండ్రిగ వద్ద మొరాయించింది. దీంతో కళాశాల, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గంట సేపు నడిరోడ్డు ఉండావల్సిన పరిస్థితి కలిగింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పుత్తూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని స్విమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ)75వ ఆవిర్భావ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యూనియన్ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు మొత్తం 117 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ యూనియన్ నాయకులు, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

మైనర్ల తల్లిదండ్రులకు సీఐ కౌన్సెలింగ్

నగరి : మైనర్లు వాహనం నడిపినా...మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని సీఐ విక్రమ్ హెచ్చరించారు. శుక్రవారం నాగలాపురం–నగరి రోడ్డులోని దేశమ్మ దేవాలయ ఆర్చ్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. అధిక సంఖ్యలో మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడడంతో వారి తల్లిదండ్రులను అక్కడికే రప్పించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు జరిమానా విధించారు. ఇకపై తరచూ వాహనాల తనిఖీ ఉంటుందని పైవిధంగా సీఐ హెచ్చరించారు.

అక్రమ క్వారీకి కేరాఫ్ విజయపురం

అక్రమ క్వారీలకు మారుపేరుగా విజయపురం మండలం నిలుస్తోంది. మండలంలో ఏ వైపు చూసినా కొండలే ఉండడంతో నాణ్యమైన గ్రావెల్ ఇక్కడ లభిస్తోంది. ఈ గ్రావెల్‌కు తమిళనాడులో మంచి డిమాండ్ ఉండడంతో రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు పలువురు నాయకుల కళ్లు దీనిపై పడ్డాయి. అధికారం అడ్డుపెట్టుకుని క్వారీల పేరిట అడ్డగోలు కొండలను పిండి చేస్తున్నారు. కోట్లు ఆర్జిస్తున్నారు.



క్వారీ తవ్వకాలతో తరిగిపోతున్న కొండలు

- తరిగిపోతున్న గుట్టలు, కొండలు
- ప్రకృతి విధ్వంసమేనంటున్న పర్యావరణ ప్రేమికులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గతంలో మాజీ మంత్రి ఆర్కే రోజా క్వారీలపై ఉక్కుపాదం మోపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ అక్రమ క్వారీ వ్యాపారం జోరందుకుంది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ స్థిరపడిన వ్యాపారులు, అక్రమ క్వారీ వ్యాపారులు విజయపురానికి మకాం మర్చారు. దీంతో పచ్చదనం కొండలు, గుట్టలు నానాటికీ తరిగిపోతున్నాయి. నెలకు ముందు ఉన్న కొండలు, గుట్టలు ఇప్పుడు కనిపించడం లేదంటే ఏ స్థాయిలో అక్రమ క్వారీ తవ్వకాలు చేస్తున్నారో ఇట్టే బోధపడుతుంది. వీటిని నిలువరించడానికి కొందరు పోరాడుతున్నా వారికి శక్తికి మించిన పనే అవుతోంది.

కోట్లలో వ్యాపారం

క్వారీ వ్యాపారం చేయడానికి ఒకసారి అనుమతి పొందితే కోట్లు వెనకేసుకుంటున్నారు. అనుమతి ఇచ్చిన ప్రభుత్వానికి వేలల్లో ఆదాయం వస్తే, వ్యాపారికి కోట్లలో ఆదాయం ఉండటం గమనార్హం ! దీంతో క్వారీ అనుమతి కోసం కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు ఎన్ని లక్షలు ఇవ్వడానికైనా వెనుకాడటం లేదనే మాట వినిపిస్తోంది.

తమిళనాడులో గ్రావెల్ తవ్వకాలపై నిషేధం

తమిళనాడులో గ్రావెల్ తవ్వకాలు పూర్తిగా నిషేధం . దీంతో తమిళనాడులో ఇళ్లు, ఫ్యాక్టరీ, రోడ్ల నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ దొరకడం కష్టంగా మారింది. దీంతో తమిళనాడుకు చెందిన కొందరు అక్రమ వ్యాపారులు ఆంధ్ర సరిహద్దు ప్రాంతామైన విజయపురం మండలం కన్ను పడింది. ఈ ప్రాంతానికి చెందిన కొందరి రాజకీయ నాయకులతో చేతుల కలిపి గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు పొంది, రేయింబవళ్లూ అనే తేడా లేకుండా మట్టిని తరలిస్తుండడంతో పచ్చదనంతో ఉన్న కొండలు, గుట్టలు ఇట్టే తరిగిపోతున్నాయి. మూడు దశాబ్దాలుగా ఇష్టానుసారంగా చేస్తున్న ఈ పనులు ఇలాగే కొనసాగితే కొంతకాలానికి కొండలు కూడా కనుమరుగవడం ఖాయమని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

దీనికి చెక్ పడేదెన్నడో..?

అక్రమ క్వారీలు నిలుపుదల చేయాలని స్థానిక ప్రజలు పోరాడుతున్నారు. క్వారీ జరిగే ప్రాంతాల్లో వాహనాలను అడ్డుకోవడం , రోడ్డుపై, కార్యాలయ ఎదుట బైఠాయించి ధర్నాలు చేయడం చేస్తూనే ఉన్నారు. కానీ అధికారుల్లో చలనం లేదు. మండల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు దీనిపై వినతులు ఇచ్చినా అడ్డుకట్ట పడటం లేదు. ఈ విధ్వంసానికి ఇకనైనా చెక్ పెట్టి, కొండలు, గుట్టల ప్రకృతి సంపదను పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

భక్తిప్రపత్తులతో వారాహి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో వారాహిమాత



హోమ పూజల్లో భక్తులు

నగరి : తిరుపతి–చెన్నై జాతీయ రహదారి ఆనుకుని కనంమిట్ట సమీపంలోని దక్షిణ కాళీ అమ్మన్ వారాహి శక్తిపీఠంలో శుక్రవారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక హోమంతో వీటికి శ్రీకారం చుట్టారు. ప్రతిష్ఠించిన కలశ తీర్థంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. చిన్నారులకు పాదాభిషేకం చేసి వస్త్రదానం చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

శాస్త్రోక్తంగా మాంగల్య పూజలు

పుత్తూరు: పరమేశ్వరమంగళం గ్రామ సమీపంలోని శ్రీదక్షిణ కాళీ వారాహీ శక్తిపీఠంలో నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు శుక్రవారం మాంగల్య పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వారాహి విశేష అలంకరణతో బాలపూజ, కన్యపూజల అనంతరం 150 మందితో మాంగల్య పూజను వేదపండితులు నిర్వహించారు. పాల్గొన్న మహిళలకు చీరలతో పాటు ప్రసాదాలను పూజారి రుతుపవన్ అందజేశారు. భక్తులకు స్కౌట్ అండ్ గైడ్స్ సభ్యులు సేవలందించారు. ఆలయ కమిటీ చైర్మన్ మోహనమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ సమస్య పట్టాలు దాటేదెన్నడో..?



గేటు వద్ద ఇరువైపులా ఆగి వున్న వాహనాలు

నగరి : మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం రైల్వేగేటు వద్ద ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో గేటువేసిన ప్రతిసారీ అధిక సంఖ్యలో రోడ్డుపై వాహనాలు బారులు తీరుతున్నాయి. గేటు తెరచినా రెండు వైపులా అధిక సంఖ్యలో వాహనాలు ఉండడంతో గేటు దాటి అవతలి వైపు వెళ్లడం గగనంగా మారుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ బ్రిడ్జి నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రైల్వే డివిజన్ మేనేజర్‌కు వినతి పత్రం సైతం ఇచ్చిన ఇక్కడ సమస్యలు నివేదించారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి సహకారంతో జరగాల్సి ఉందని అవసరమయ్యే నిధుల్లో సగం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పడంతో సమస్యకు పరిష్కారం ఎప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది.

కూటమి మోసాలను ప్రజల్లో ఎండగడతాం



మాట్లాడుతున్న తులసి, అన్నలగన్

పాలసముద్రం : అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని, కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజల్లో ఎండగట్టేందుకు తమ పార్టీ ×బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ× కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్నలగన్ తెలిపారు. దీనికి సంబంధించి శనివారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ సుందరరాజు, సర్పంచ్ అయ్యప్ప పాల్గొన్నారు.

అలరించిన 'అర్జున తపస్మాన్'



తపస్సుమాను చుట్టూ వరపడ్డ మహిళా భక్తులు

- వేడుకగా ఉత్తర గోగ్రహణం

కార్వేటినగరం: స్థానిక శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా శుక్రవారం 'అర్జున తపస్మాన్' ఘనంగా నిర్వహించారు. తొలుత ద్రౌపదమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తపస్మాన్‌ను అర్జున వేషధారి అధిరోహించాడు. మెట్టు ..మెట్టుకు పద్యాలు ఆలపిస్తూ, తనవెంట తీసుకెళ్లిన నిమ్మకాయలు, వీభూది ఉండలు, పూలను విసరడంతో భక్తులు వాటికోసం ఎగబడ్డారు. మహిళలు తడిదుస్తులతో తపస్మాన్ చుట్టూ వరపడ్డారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భాగతారిణి రెడ్డెమ్మ అర్జున తపస్మాన్ ఘట్టంపై హరికథాగానం చేశారు. అంతకు ముందు శివ పార్వతులను నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ద్రౌపదమ్మకు ఉభయదారులు వన్నెరెడ్డి కులస్తులు సమర్పించిన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించారు. కర్పూర నీరాజనాలతో భక్తులు మొక్కులు చెల్లించారు. ఉత్తర గోగ్రహణంలో భాగంగా నకుల సహదేవుల వేషధారులు ఆవుల మళ్లింపు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.



అర్జున తపస్మాన్ ఘట్ట ప్రదర్శనను వీక్షిస్తున్న భక్తులు

పరిసరాల శుభ్రత.. ప్రజల బాధ్యత

పెనుమూరు (కార్వేటినగరం): పరిసరాల శుభ్రత బాధ్యత గ్రామ ప్రజలదేనని ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగుపల్లెలో ఇంటింటా చెత్తసేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, మహిళలు పొడి చెత్త, తడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులు తెచ్చే బండిలో వేయాలన్నారు. మండలంలో అన్ని సచివాలయ పరిధిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ సహాయకులతో దీనిపై పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, జన్మశ్రీ విద్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

భరతమాత ముద్దుబిడ్డ 'అల్లూరి'

- పోరాటాల స్ఫూర్తి..తెలుగునేల గౌరవం సీతారామరాజు
- మాజీ మంత్రి ఆర్కేరోజా



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

విజయపురం : అల్లూరి సీతారామరాజు భరతమాత ముద్దుబిడ్డ అని, ఆయన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను స్థానికంగా ఉన్న ఆయన విగ్రహం నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి రోజా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేసి మాట్లాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, ఆత్మస్థైర్యం యువతకు ఆదర్శం కావాలన్నారు. పోరాట స్ఫూర్తితో తెల్లదొరలకు వణుకు పుట్టించడంతో పాటు తెలుగునేలకు గౌర వం తెచ్చిన వీరుడన్నారు. ఆయన జీవించింది 27 ఏళ్లు మాత్రమే అయినా ఆయన సాధించిన కీర్తి వర్ధిల్లుతూనే ఉంటుందన్నా రు. ఆయన ఒక వ్యక్తి కాదని భావితరాలకు స్ఫూర్తిగా నిలిచే ఒక శక్తి అన్నారు. అల్లూరి త్యాగాన్ని యువతరానికి తెలియజెప్పాలని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భావించి ఈ దేశంలో ఎవ్వరూ ఇవ్వనంత గొప్ప గౌరవాన్ని ఆయనకు ఇచ్చారన్నారు. ఒక జిల్లాకు అల్లూరి పేరు పెట్టారని, అలాగే 22 ఎకరాల లో అల్లూరి మ్యూజియం కూడా పాడేరులో ఏర్పాటు చేస్తున్న ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శివరాజు, రాష్ట్ర నాయకులు గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, గోవర్ధన్‌నాయుడు, నాయకులు నార్పరాజు, భాస్కర్‌రెడ్డి, కేవీరాజు, కుమా ర్‌రెడ్డి, సురేష్‌నాయుడు, సుధాకర్‌రాజు, ప్రతాప్ రాజు, దిలీప్‌రాజు, అరుణాచలం, శ్రీరాములురెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి

పుత్తూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ నగరి నియోజకవర్గ బూత్ కమిటీ చైర్మన్ ఎం.సురేష్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సురేష్‌రాజు మాట్లాడుతూ, మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరులో అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేసి యువతలో చైతన్య స్ఫూర్తిని నింపారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌రాజు, డాక్టర్ రవిరాజు, రామ్మోహన్‌వర్మ, లక్ష్మణరాజు, బాబురాజు, దామోదర్‌రాజు, శివకుమార్ రాజు, బాలసుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు: నివాళులర్పిస్తున్న క్షత్రియ నేతలు

నోటీస్ బోర్డు

రేపు గురుపూజోత్సవం

- పుత్తూరు: పట్టణంలోని కేపీ రెసిడెన్సీలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు పుత్తూరు ఖండ కార్యవాహక్ ఎల్.గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ధార్మిక చైతన్యం, సేవా భావనను పెంపొందించడం గురుపూజోత్సవం ఉద్దేశమని తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొనాలని కోరారు.

మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ

నగరి: మండలంలో 47మంది మెప్మా ఆర్పీలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మెప్మా సంబంధిత వివరాల నమోదుకు వీటిని పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

నిండ్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

ఎర్రమట్టి తవ్వకాలపై సిట్ విచారణ చేయాలి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై జిల్లా కలెక్టర్ సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలో గత కొద్ది రోజులుగా అక్రమంగా కొండలు తవ్వి ఎర్రమట్టిని పక్క రాష్ట్రం తమిళనాడుకు తరలిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడాన్ని వారు విమర్శించారు. పాలసముద్రం మండలం సాయినగర్, ఎస్ఆర్ఆర్ కండ్రిగ, వనదుర్గాపురం తదితర గ్రామ పరిసరాల్లో కొండల్లో హిటాచీల ద్వారా వందలాది టిప్పర్ల ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు మీడియా చానళ్ల ద్వారా వెలుగులోకి వస్తోందన్నారు. అధికార పార్టీ నేతలు చేస్తున్న అక్రమాలు వార్తల్లో వస్తున్నా కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. వీటిపై ఆధారాలతో సహా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

పునరావాసం కల్పించరూ!



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటేష్

పుత్తూరు: మండలంలో తడుకు రెవెన్యూ లెక్క దాఖలాలలో ఏర్పాటు చేయతలపెట్టిన వేణుగోపాల్ సాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని శ్రీబాలాజీ ఎస్సీ ఎస్టీ సంక్షేమ సమితి నాయకులు వెంకటేష్ శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, వేణుగోపాల్ సాగర్ నిర్మాణంలో సదాశివపురం, టీఆర్‌కండ్రిగ ఎస్టీ, ఎస్సీ కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు సైతం ధృవీకరించారన్నారు. ఈ కాలనీలకు సంబంధించి 180 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని, వీరికి ముందుగా పునరావాసం కల్పించాలని కోరారు. అలాగే విద్యుత్ సదాశివపురంలో నివసిస్తున్న కొండ యానాది తెగలకు చెందిన ఎస్టీ ప్రజలకు ఇప్పటి వరకు ఆధార్, రేషన్ కార్డులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి జాప్యం చేయకుండా కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలకు ప్రొసీడింగ్స్ ఇప్పించాలని కోరారు.

బదిలీ టీచర్లకు సన్మానం



బదిలీ టీచర్లను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు, సహచర ఉపాధ్యాయులు

పాలసముద్రం: మండలం నుంచి బదిలీ అయిన టీచర్లకు శుక్రవారం ఎంఈఓ రాజేంద్రప్రసాద్, గిరిజ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. మండల ఎస్టీయూ నాయకుడు కోదండయ్య, ప్రకాష్ టీచర్ల సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో కుమార్, చంద్రశేఖర్, చిరంజీవి, సీఆర్పీలు, మండలంలోని టీచర్లు పాల్గొన్నారు.